# సాక్షి గుంటూరు

శుక్రవారం । 17 । మార్చి । 2023





## వేసవి కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్

గుంటూరు వెస్ట్: వేసవిని ఎదుర్కొనేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని జేసీ జి.రాజ కుమారి తెలిపారు. సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి నిర్వహించిన వీసీలో ఆమె మాట్లాడారు.



## నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6,000, గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.6,500 వరకు పలికింది.



## పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నీటి నిల్వ 42.9635 టీఎంసీలుగా ఉంది. ఎగువ నుంచి 2,000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2,200 క్యూసెక్కులు వదులుతున్నారు.

## న్యూస్‌రీల్

### పొట్టి శ్రీరాములు త్యాగం అమరం



నరసరావుపేట: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లాకలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, డీపీఓ భాస్కర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, జిల్లా ఉద్యానశాఖ అధికారి బీజే బెన్నీ, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ అనీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### పల్నాడు జిల్లా డీఈఓగా శామ్యూల్



నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారిగా కె.శామ్యూల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీ మోడల్ స్కూల్స్ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శామ్యూల్‌ను డీఈఓగా నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ డీఈఓగా పనిచేసిన ఎం.వెంకటప్పయ్యను ఉపాధ్యాయులతో అనుచితంగా ప్రవర్తించాడనే కారణంతో బదిలీ చేశారు. ప్రస్తుతం కార్యాలయ ఏఓ వెంకటేశ్వర్లు ఇన్‌చార్జి డీఈఓగా వ్యవహరిస్తున్నారు. పదవ తరగతి పరీక్షలు దగ్గర పడుతుండటంతో పూర్తి బాధ్యతలతో శామ్యూల్‌ను డీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

### మిరప, పసుపు రైతులు అప్రమత్తంగా ఉండాలి

కొరిటెపాడు(గుంటూరు): నేటి నుంచి మూడు రోజుల పాటు అధిక వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ సూచించిందని, మిర, పసుపు రైతులు కోతలు కోయవద్దని జిల్లా ఉదాన అధికారి ఎన్.సుజాత గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఇప్పటికే కోసి కల్లాల్లో ఆరబోసిన మిరప కాయలు, పసుపు కొమ్ములను సిల్పాలిన్, టార్పాలిన్ పరదాలతో కప్పుకొని తగు జాగ్రత్తలు చేసుకోవాలని కోరారు. ఎండబెట్టిన మిరప కాయలు, తయారైన పసుపును జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలలో నిల్వ చేసుకోవాలని సూచించారు. వర్షాలు ఆగిన తర్వాత మాంకోజెట్, బావిస్టిన్ కలిపిన మందును 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకున్నట్లయితే తాలు కాయలు రాకుండా కాపాడుకోవచ్చని ఆమె తెలిపారు.

### యార్డులో 1,18,750 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,20,879 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,18,750 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 88,685 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

### సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 536.70 అడుగుల వద్ద ఉంది. ఇది 181.5216 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 9,500, ఎడమకాలువకు 9,166, ఎస్ఎల్‌బీసీకి 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 20,666 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 20,666 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

# అన్నదాతకు అగ్రిపీటం

- సంక్షేమంతో పాటు అభివృద్ధి
- జిల్లాలో సాగునీటి రంగానికి భారీ కేటాయింపులు
- కృష్ణాడెల్టా ఆధునికీకరణకు రూ. 202.61 కోట్లు
- పులిచింతలకు రూ. 22.67 కోట్లు
- పరుగులు పెట్టనున్న వ్యవసాయ రంగం
- అన్నదాతల మోమున చిరునవ్వు
- అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్

ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2023–24 రాష్ట్ర బడ్జెట్ జన రంజకంగా సాగింది. ఈ పద్దులో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, సంక్షేమం ఇలా అన్ని రంగాలకు పెద్ద పీట వేశారు. ముఖ్యంగా వ్యవసాయాధారిత గుంటూరు జిల్లాలో కృష్ణా డెల్టా ఆధునికీకరణకు, పులిచింతల నిర్మాణాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తమవుతోంది.

## రాష్ట్ర బడ్జెట్‌పై సర్వత్రా హర్షం



సాక్షి ప్రతినిధి, గుంటూరు: 2023–24 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో రైతన్నలకు పెద్దపీట వేశారు. వ్యవసాయ, నీటిపారుదల శాఖలకు భారీగా కేటాయింపులు జరిగాయి. ఇది ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్‌గా నిలుస్తుందని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతు భరోసా, బీమా చెల్లింపులు, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ, పగటి పూట తొమ్మిది గంటల విద్యుత్, ఆర్‌బీకేల ద్వారా ఈ-క్రాప్ బుకింగ్ వంటి వాటికి అధనంగా నిధులు కేటాయించారు. రైతు భరోసాకు రూ.4,020 కోట్లు, పీఎం బీమా యోజనకు రూ.1600 కోట్లు, రైతులకు వడ్డీలేని రుణాలకు రూ.500 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ఎక్కువ శాతం నిధులు కేటాయించడంతో జిల్లాలో మరింత మంది రైతులకు లాభం చేకూరనుంది. కృష్ణాడెల్టా ఆధునికీకరణకు రూ. 202.61 కోట్లు కేటాయించగా, పులిచింతలకు రూ. 22.67 కోట్లు కేటాయించారు. గుంటూరు చానల్ విస్తరణ, వరికెపూడి ప్రాజెక్టులకు కూడా కేటాయింపులు ఉంటాయని ఇరిగేషన్ వర్గాలు చెబుతున్నాయి.

**అన్నింటికీ అ'ధన'మే..!**

బీసీలకు సంక్షేమ కేటాయింపుల్లో 32.5% పెరుగుదల ఉండటం పట్ల బీసీ వర్గాలవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణాల అభివృద్ధిపై కూడా బడ్జెట్‌లో దృష్టి పెట్టారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు 6.6 శాతం అదనపు కేటాయింపులు జరిగాయి. అదేవిధంగా రోడ్ల అభివృద్ధికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. 6.2 శాతం అదనపు బడ్జెట్ కేటాయించారు. సంక్షేమ పథకాల కేటాయింపులు పది శాతంపైగా పెరగడంపై విశ్లేషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యారంగానికి 7 శాతం, వైద్య ఆరోగ్య రంగానికి 3.2 శాతం, వ్యవసాయ రంగానికి 3 శాతం అదనపు కేటాయింపులు రావడంపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### ఎక్స్‌ప్రెస్ హైవేకు రూ.100 కోట్లు

అనంతపురం–అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే కోసం బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించారు. అదేవిధంగా మంగళగిరిలో నిర్మించిన ఆల్‌ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కు మంచి నీటి సరఫరా కోసం రూ.1.06కోట్లు కేటాయించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి రూ.54 కోట్లు కేటాయించారు. ఇది గత ఏడాది కంటే రూ.17.09 కోట్లు ఎక్కువ. బాపట్ల జిల్లా కొరిసపాడు ఎత్తిపోతల పథకానికి రూ.74.03 లక్షలు కేటాయించారు.

### అభివృద్ధిని పరుగులు పెట్టించే బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్ అభివృద్ధిని మరింత పరుగులు పెట్టిస్తుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నారు. పేదలకు మరింత సాయం అందించే దిశగా, రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా బడ్జెట్‌ను తీసుకువచ్చారు. విద్య, వైద్యం, వ్యవసాయం, నీటిపారుదలతో అన్ని రంగాలకు సమతుల్యత కల్పించారు.

– డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

### డెవలప్‌మెంట్ ఏపీ ఎక్స్‌ప్రెస్ బడ్జెట్ ఇది..



డెవలప్‌మెంట్ ఏపీ ఎక్స్‌ప్రెస్ బడ్జెట్ ఇది. ఈ బడ్జెట్‌లో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యమిచ్చారు. రైతు భరోసా కేంద్రాల వంటి వాటి ద్వారా వ్యవసార రంగంలో ఆదర్శవంతమైన సంస్కరణల అమలుకు మరింత ఎక్కువగా నిధులు కేటాయించారు. సంక్షేమానికి కేటాయించే ప్రతి రూపాయి మానవ వనరుల అభివృద్ధికి, తద్వారా రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తుందనే వాస్తవం ఈ బడ్జెట్‌లో తేటతెల్లమయ్యింది.

– ఆచార్య కె.మధుబాబు, ఆర్థికశాస్త్ర విభాగాధిపతి, ఏఎన్‌యూ

### సంక్షేమ రంగానికి పెద్దపీట



విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం, అభివృద్ధికి అన్ని విధాల సమతూకంగా బడ్జెట్ ఉంది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, కాపులకు సంక్షేమ పథకాలు అందించేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి. రాష్ట్ర విభజన తర్వాత ఇంత పెద్ద బడ్జెట్ ప్రవేశ పెట్టడం ఇదే మొదటిసారి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చేలా బడ్జెట్ ఉంది.

– ఆతుకూరి ఆంజనేయులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

### గతంలో ఎన్నడూ లేని గొప్ప బడ్జెట్



గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్ గొప్పగా ఉంది. రైతాంగం, విద్య, వైద్యరంగానికి ఉపయోగకరంగా ఉంది. వస్త్ర, చేనేత రంగానికి గుర్తింపు ఇవ్వలేదు. సంక్షేమ రంగానికి పెద్దపీట వేశారు. అన్ని రంగాలను అభివృద్ధి పరచే విధంగా బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. చిరు వ్యాపారులు, వస్త్ర వ్యాపారులను ఆదుకునేందుకు కేటాయింపులు చేయాలి.

– బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, ఏపీ టెక్స్‌టైల్ ఫెడరేషన్ అధ్యక్షుడు

### రాష్ట్ర ప్రగతికి దశ, దిశ..



బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి దశ, దిశ చూపే విధంగా ఉంది. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ గత నాలుగేళ్లుగా అమలు పర్చిన నవరత్నాలు, లక్షలాది మంది పేదలందరికీ ఇళ్లతో పాటు మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే రీతిలో అద్భుతమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

– కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీ చైర్‌పర్సన్

### రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దిక్సూచి..



బడ్జెట్ పూర్తిగా జనరంజకమైనది. గడప, గడపకు సంక్షేమ ఫలాలు అందడమే కాక, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దిక్సూచిలా బడ్జెట్ ఉంది. నవరత్నాల అమలు, జెండర్ బేస్డ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్‌ప్లాన్‌ల ద్వారా మహిళలు, బలహీనవర్గాలు, పేదలు లబ్ధి పొందే ఆస్కారం ఉంది.

– డాక్టర్ పి.వేణుగోపాల్, ఆర్థికశాస్త్ర విభాగాధిపతి, హిందూ కళాశాల, గుంటూరు

### 12వ పీఆర్సీ ప్రస్తావన లేదు



ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల వేతన సవరణకు సంబంధించి 12వ పీఆర్సీపై రాష్ట్ర బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం శోచనీయం. బడ్జెట్ ప్రతిపాదిత వ్యయాలు రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి నెడతాయి. ఆదాయ మార్గాలు అస్థిరంగా ఉండటం, కేంద్రం నుంచి వచ్చే నిధులు సైతం అంతంత మాత్రంగా ఉండడం రాష్ట్రాభివృద్ధికి కొంత విఘాతమే.

– కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ

### బడుగు వర్గాల సంక్షేమ బడ్జెట్



అన్నివర్గాల మహిళల సంక్షేమానికి, మహిళా సాధికారతకు బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు. అమ్మఒడి ద్వారా పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించి తల్లుల్లో మనోధైర్యం నింపారు. ముఖ్యంగా నిరుపేదలు, బడుగు వర్గాల సంక్షేమ బడ్జెట్ ఇది.

– భవానీ, గృహిణి, గుంటూరు

## అమరజీవి త్యాగం.. అజరామరం



అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

గుంటూరు వెస్ట్: ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించిన అమరజీవి పొట్టి శ్రీరాములు నేటి సమాజానికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కొనియాడారు. పొట్టి శ్రీరాములు 123వ జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేసీ జి.రాజకుమారి, డీఆర్‌ఓ చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, డీఈఓ శైలజ, జిల్లా అధికారులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెవెన్యూ సర్వీసెస్ ఉద్యోగుల సంఘం నాయకులు నివాళులర్పించారు.

**సీఆర్డీఏ ఉద్యోగుల నివాళి..**

సాక్షి, అమరావతి: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా గురువారం విజయవాడలోని ఏపీ సీఆర్డీఏ కార్యాలయంలో కమిషనర్ వివేక్ యాదవ్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సీఆర్డీఏ అదనపు కమిషనర్లు కట్టా సింహాచలం, షేక్ అలీంబాషా, స్పెషల్ కలెక్టర్ టి.చిరంజీవి పాల్గొన్నారు.

### ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

**ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 134 కేంద్రాల్లో 43,114 మంది హాజరు**



గుంటూరు ఏసీ కళాశాలలో సెకండియర్ పరీక్షలు రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు వరుసగా రెండో రోజు మాల్ ప్రాక్టీసులకు తావు లేని వాతావరణంలో ప్రశాంతంగా జరిగాయి. గురువారం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాల పరిధిలో జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 44,186 మంది విద్యార్థులకు గానూ 43,114 మంది హాజరయ్యారు. విద్యార్థులందరు నిర్దేశిత సమయానికి గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను చేర్చేందుకు ఆర్టీసీ అదనపు బస్సులను నడిపింది. గుంటూరు నగరంలో ప్రైవేటు సిటీ బస్సులతో పాటు వివిధ ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల బస్సుల్లో విద్యార్థులను ఆయా రూట్లలో ఉన్న పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లారు. ఆర్ఐఓ జి.సునీతతో పాటు ఇంటర్మీడియెట్ పరీక్షల పరిశీలకురాలు శాంతకుమారి, మూడు జిల్లాల డీఈఓలు, డీఈసీ సభ్యులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు కలిసి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 68 పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగినట్లు ఆర్ఐఓ జి.సునీత చెప్పారు. ఎటువంటి మాల్ ప్రాక్టీసులు నమోదు కాలేదని స్పష్టం చేశారు.

### పోలీస్ స్టేషన్ నుంచి మైనర్లు పరార్!

తెనాలిరూరల్: బైక్‌ల చోరీ కేసులో అనుమానితులుగా స్టేషన్‌కు తీసుకువచ్చిన ముగ్గురు మైనర్లు పోలీసుల కళ్లుగప్పి పరారయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.. తెనాలి సబ్ డివిజన్‌లోని ఓ పోలీస్ స్టేషన్‌లో చోరీ కేసు విషయమై తెనాలి మండలానికి చెందిన నలుగురు మైనర్లను పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చారు. విచారణ కోసం వారిని స్టేషన్‌లో ఉంచగా, గురువారం సాయంత్రం స్టేషన్ సిబ్బంది కళ్లుగప్పి ముగ్గురు పరారైనట్లు తెలిసింది. స్టేషన్ నుంచి నిందితులు, అందునా మైనర్లు పారిపోవడం పోలీసు వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. పరారైన వారి కోసం తిరిగి వెతుకులాట చేపట్టినట్టు తెలిసింది. బస్టాండ్, రైల్వేస్టేషన్లలో గాలించినా ఫలితం లేకుండా పోయినట్లు తెలిసింది.

# ప్రాణం.. తృణప్రాయం

## నష్టపరిహారానికి తిలోదకాలు

పేరుగొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా రూ.300 కూడా చేయని సరుకులను రూ.3వేల విలువైనవంటూ ఊదరగొట్టారు.. మహిళలను రప్పించారు.. పంచేటప్పుడు వీడియోల్లో ఎక్కువ మంది కనిపించాలనే ప్రచారకాంక్షతో ఇరుకు స్టాళ్లు ఏర్పాటు చేసి ముగ్గురు అమాయకులైన మహిళల మృతికి కారకులయ్యారు.. బాధిత కుటుంబాలకు రూ.20లక్షలు నష్టపరిహారం ఇస్తామంటూ ఆర్భాటంగా ప్రకటించారు.. తీరా ముఖం చాటేశారు.. పేదల జీవితాలతో చెలగాటమాడడమే కాకుండా ఇస్తామన్న పరిహారం కూడా ఇవ్వకుండా పరిహాసమాడుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఉయ్యూరు ఫౌండేషన్‌పై మండిపడుతున్నారు.

### ముఖం చాటేసిన ఉయ్యూరు ఫౌండేషన్ శ్రీనివాస్

- చంద్రన్న కానుకల పంపిణీ పేరుతో హడావుడి
- తొక్కిసలాటలో ముగ్గురు మృతి
- ఒక్కొక్కరికి రూ.20 లక్షలు నష్ట పరిహారం ఇస్తానని ప్రకటన
- బాధితులకు ఇప్పటివరకు అందని సాయం




తొక్కిసలాట అనంతర దృశ్యం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తన రాజకీయ అరంగేట్రం కోసం ముగ్గురిని బలితీసుకున్న ఉయ్యూరు ఫౌండేషన్ నిర్వాహకుడు శ్రీనివాస్ వారికి ఇచ్చిన హామీ మూడు నెలలు అయినా అమలు చేయకపోవడంపై బాధితులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన చంద్రన్న కానుక, అన్నగారి జనతా వస్త్రాల పేరుతో గుంటూరులో భారీ సభ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఒక్కొక్కరికి రూ.3వేలు విలువైన కానుకలు ఇస్తామని ఇంటింటికి తిరిగి జనసమీకరణ చేసి చివరికి చిరుగులు పడిన చీరలు...పురుగులు పట్టిన కందిపప్పు...నీరు గారుతున్న ఉల్లిపాయలు, పనికిరాని బెల్లముక్క...ఎండిన చింతపండు చంద్రన్న కానుక పేరుతో ఇచ్చే ప్రయత్నం చేశారు. వీటి విలువ మూడు వేలు కాదు కదా మూడు వందలు కూడా చేయదు.

**పత్తాలేని ఉయ్యూరు ఫౌండేషన్ శ్రీనివాస్..**

ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడిని పిలిచి ప్రచార ఆర్భాటం కోసం ఉచితంగా సరుకులు పంపిణీ చేస్తున్నామని పేదలను కాలనీల నుంచి ఆటోలు పెట్టి తరలించారు. అదేవిధంగా ప్రజలకు టోకెన్‌లను పంపిణీ చేశారు. చంద్రబాబు మీటింగ్‌కు ముందే చీరెలు పంపిణీ చేస్తే జనాలు కనిపించరని ఆలస్యంగా పంపిణీ చేస్తే జనాలు వచ్చారని ప్రచారం చేసుకోవచ్చని ప్లాన్ చేశారు. ఈ ప్లాన్ కాస్తా వికటించి తొక్కిసలాట జరిగి ముగ్గురు మహిళలు మృత్యువాత పడగా, పదుల సంఖ్యలో మహిళలు గాయపడ్డారు. తొక్కిసలాట జరిగిన వెంటనే ఉయ్యూరు ఫౌండేషన్ నుంచి మరణించిన వారికి ఒక్కొక్కరికి రూ. 20 లక్షలు నష్టపరిహారం ఇస్తానంటూ ప్రకటించారు. గాయపడిన వారికి అయ్యే ఆస్పత్రి ఖర్చులన్నీ భరిస్తానని హామీ ఇచ్చారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షలు ప్రకటించి మరుసటిరోజున అందజేసింది. టీడీపీ రూ.5లక్షలు, ఇతర నాయకులు మరో రూ.4లక్షలు ప్రకటించారు. గాయపడిన వారికి తలో రూ.50వేలు ఇవ్వనున్నట్లు నేతలు, తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. కానీ గాయపడిన వారికి ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ప్రభుత్వ నుంచి మాత్రమే వారికి సాయం అందింది. రూ. 20 లక్షలు ఇస్తానన్న ఉయ్యూరు శ్రీనివాస్ మాత్రం అడ్రస్ లేరు. తనపై కేసు నమోదు అయ్యిందని, ఫిర్యాదుదారుడు ఆ కేసును వెనక్కి తీసుకుంటేనే నష్టపరిహారం ఇస్తానని చెప్పినట్లు బాధితులు చెబుతున్నారు. మొదట్లో బిజీగా ఉన్నామని చెప్పిన వారు తర్వాత అసలు ఫోన్లు ఎత్తడం మానేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.

### ఇప్పటివరకు ఏ సాయం అందలేదు..



తొక్కిసలాటలో మా కుమార్తె సయ్యద్ ఆసియా చనిపోయి, సుమారు రెండు నెలలకు పైమాటే.. కన్న కుమార్తె జ్ఞాపకాలు ఇప్పటికీ మమ్మల్ని వెంటాడుతూనే ఉన్నాయి. కొత్త సంవత్సరం వేళ.. ఆ రోజు చీరల పంపిణీకి వెళ్తున్నానని వెంటనే వచ్చేస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. అవే ఆఖరి మాటలు.. ఆఖరి చూపు. మా కుమార్తె మరణించాక మనవడు నజీర్‌బాషా, మనవరాలు నస్రీమా నా వద్దనే ఉంటున్నారు. గతంలో కుమార్తె ఉన్న ఇంటికి అద్దె చెల్లించే స్తోమతలేక ఇరుకు ఇంట్లోనే అందరం కలిసి ఉంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం, పలువురు ఆర్థికంగా చేయూత అందించారు. అయితే చంద్రన్న కానుకల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఉయ్యూరు ఫౌండేషన్ నుంచి ఇప్పటివరకూ ఏసాయం అందలేదు.

– రహంతున్నీసా, మృతురాలు ఆసియా తల్లి

### టీడీపీ నాయకులు ఆదుకోలేదు



తోపులాటలో నా రెండు కాళ్లు గేటులో ఇరుక్కుపోయాయి. చికిత్స అనంతరం ఇంటికి వచ్చాను. అప్పటి నుంచి ఆరోగ్యం బాగోలేదు. గతంలో పాచిపనులకు వెళ్లేదాన్ని. ఇప్పుడు ఇంటి వద్దనే ఉంటున్నాను. ప్రభుత్వం ప్రకటించిన రూ.50వేలు అందాయి. టీడీపీ నాయకులు ఇస్తామన్న పరిహారం ఇప్పటి వరకు ఇవ్వలేదు.

– కమాధుల సరోజిని, తుఫాన్ నగర్

### అదృష్టవశాత్తు బతికి బయటపడ్డాం



తోపులాటలో శరీరం ఇనుప బారికేడ్లకు ఒత్తుకు పోయింది. ఒక దశలో ప్రాణాలు పోతున్నాయనుకున్నాను. అదృష్టవశాత్తు బతికి బయటపడ్డాను. గతంలో బండి నెట్టుకుంటూ అమ్మకానికి వెళ్లేదాన్ని. ఇప్పుడు ఒక్కదాన్నే వెళ్లలేక నా కుమారుడి సహాయంతో తప్పని పరిస్థితుల్లో వెళుతున్నాను. టీడీపీ నాయకులు ఇస్తామన్న సహాయం ఇప్పటి వరకు ఇవ్వలేదు.

– తెల్లమేకల మంగమ్మ, శ్రీకృష్ణదేవరాయ నగర్

### మాట తప్పిన టీడీపీ నేతలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇస్తామన్న రూ.50వేలు అందాయి. టీడీపీ నాయకులు ఇస్తామన్న సహాయం నేటికీ ఇవ్వలేదు. నాకు నడుముకు దెబ్బతగిలింది. ఇప్పటికీ నడుము నొప్పులతో బాధపడుతున్నాను. టీడీపీ వారికి మాట తప్పడం మామూలే.

– తెల్లమేకల రంగాదేవి, భాగ్యనగర్

### కమిటీ నివేదిక వచ్చాక చార్జిషీట్

తొక్కిసలాటపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన విచారణ కమిటీ నివేదిక వచ్చిన తర్వాత ఆ నివేదిక ఆధారంగా చార్జిషీట్ వేస్తాం. దీనిపై కేసు నమోదు చేసినా ఆ రిమాండ్ రిపోర్టును న్యాయమూర్తి తిరస్కరించినందున కమిటీ నివేదిక వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో చార్జిషీట్ వేస్తాం.

– బత్తుల శ్రీనివాసరావు, నల్లపాడు సీఐ

# అకడమిక్ ఎగ్జిబిషన్‌లో నూతన ఆవిష్కరణలు

- అబ్బురపరచిన ప్రదర్శనలు
- ప్రతిబింబించిన సామాజిక, శాస్త్ర, సాంకేతికత
- కళాశాలలు, పాఠశాలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరు
- ఆసక్తిగా వీక్షించిన సందర్శకులు
- ప్రత్యేక ఆకర్షణగా వాట్సప్ క్విజ్, బెస్ట్ సెల్ఫీకాంటెస్ట్



దేంజర్ బెల్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**ఏఎన్‌యూ:** ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కొనసాగుతున్న అకడమిక్ ఎగ్జిబిషన్‌లో రెండో రోజైన గురువారం పలు ప్రదర్శనలు విజ్ఞానం, వినూత్నాన్ని పంచాయి. సోషల్ సైన్సెస్, సైన్స్, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషన్ రంగాలకు చెందిన విద్య, పరిశోధనా విభాగాలు 180 స్టాల్స్‌లో 850కిపైగా విభిన్న అంశాలపై ప్రదర్శలు, ఆవిష్కరణలు చేశాయి. సామాజికాభివృద్ధి, చరిత్ర, సంస్కృతి, కళలు, శాస్త్ర, సాంకేతిక, పర్యాటక, ఆరోగ్య పరిరక్షణ, వ్యాయామం, శారీరక దారుఢ్యం, న్యాయ సలహాలు, తదితర అంశాలపై ప్రదర్శనలు సందేశాత్మకంగా సాగాయి. పలు విభాగాల ప్రదర్శనలు ఆహ్లాదాన్ని, ఆరోగ్య పరిరక్షణను చాటుగా పలు విభాగాల ప్రదర్శలు విద్యార్థులు, సందర్శకుల్లో మేథస్సును పెంపొందించాయి. విద్య, పరిశోధనాంశాల ఆవశ్యకత, ఫార్మసీ రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలు, అంతరిక్ష ప్రయోగాలు, పచ్చదనం పరిరక్షణ, సహజవనరుల సద్వినియోగం అంశాల వంటి సామాజిక బాధ్యతను వివరిస్తూ చేసిన ప్రదర్శనలు విద్యార్థులను ఆలోచింపజేశాయి. వీటితోపాటు చరిత్ర, జాతీయ నాయకుల జీవిత చరిత్రను నేటి తరానికి తెలియజేసే ప్రదర్శనలు చేశారు.

**ప్రత్యేక ఆకర్షణగా సాంకేతిక ప్రదర్శనలు**

అకడమిక్ ఎగ్జిబిషన్‌లో ఎకో టూరిజం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకుని పలు ప్రాంతాలలో ఉన్న పర్యాటక ప్రాంతాలు, అక్కడ ఉన్న వసతులు, ప్రత్యేకతలు తెలిపే డిజిటల్ టూరిజం,పీఎస్ఎల్వీ మిస్సైల్స్ వంటి అంతరిక్ష ప్రయోగాలు, డిజిటల్ కమ్యూనికేషన్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పరిజ్ఞానం, మన సంస్కృతి, సాంప్రదాయాలు, పురాతన ఆలయాలు, గ్రీకుల కాలం నాటి కట్టడాలు వినూత్నంగా సాగాయి. వీటితోపాటు ఆరోగ్యం ఆవశ్యకతను తెలియజేస్తూ సీపీఆర్, యోగా, మెడిటేషన్, వ్యాయామం వంటి, సంస్కృతిలో భాగమైన తోలుబొమ్మలాట, పలు అంశాలపై న్యాయసలహాలు ఏ విధంగా పొందాలనే అంశాలు వివరించారు.

**భారీగా సందర్శకులు హాజరు**

రెండు రోజులపాటు జరిగిన అకడమిక్ ఎగ్జిబిషన్‌ను 15,800 మందికిపైగా విద్యార్థులు, సందర్శకులు వీక్షించారని ఎగ్జిబిషన్ కోఆర్డినేటర్ ఆచార్య కె మధుబాబు, డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్దయ్య తెలిపారు. వీరిలో 18 పాఠశాలలు, 7 కళాశాలలు ఉన్నాయన్నారు. రెండోరోజు ప్రదర్శనలను వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, పలువురు యూనివర్సిటీ అధికారులు సందర్శించి సందర్శకుల జాబితాలలో తమ అభిప్రాయాలు రాశారు.

**ప్రత్యేక ఆకర్షణగా వాట్సప్ క్విజ్**

ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ డెస్క్ నిర్వహిస్తున్న వాట్సప్ క్విజ్, బెస్ట్ సెల్ఫీ కాంటెస్ట్, స్లోగన్ కాంపిటీషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతి గంటకు మైక్ ద్వారా ఒక ప్రశ్నను చెప్పి దానికి జవాబును నిర్వాహకుల వాట్సప్‌కు పంపమని సూచిస్తున్నారు. గంట తరువాత సరైన జవాబులు పంపిన వారిలో లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి గంటగంటకూ బహుమతులు అందజేస్తున్నారు. అకడమిక్ ఎగ్జిబిషన్ శుక్రవారంతో ముగియనుంది. ముగింపు సభకు హైదరాబాద్ డీఆర్‌డీఎల్ డైరెక్టర్ డాక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేస్తారు.

# అమరజీవి స్ఫూర్తితోనే అధికార వికేంద్రీకరణ

- ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి
- ఘనంగా పొట్టిశ్రీరాములకు నివాళి

**పట్నంబజారు (గుంటూరు తూర్పు):** అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికార వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్షతో తన ప్రాణాన్ని తృణప్రాయంగా త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని గురువారం హిందూ కాలేజ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుతోనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందుతాయన్న దృఢసంకల్పంతో పొట్టి శ్రీరాములు సాధించిన ఆంధ్ర రాష్ట్రం కొందరు స్వార్థపరుల కుట్రల ఫలితంగా విచ్ఛిన్నమైందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులు మళ్లీ తలెత్తకూడదనే సీఎం జగన్ అధికార వికేంద్రీకరణతో రాష్ట్రంలోని మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు.

గత పాలకులు పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగాన్ని సైతం అపహాస్యం చేసే రీతిలో 5 సంవత్సరాల పదవీ కాలంలో కనీసం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు సైతం నిర్వహించలేదని, జగన్ సీఎం అయ్యాకనే వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ ఏ ఆంధ్రుల మేలు కోసమైతే అమరజీవి పొట్టి శ్రీరాములు తన ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించారో... ఆ ఆంధ్రుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మిర్చియార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), రోషన్, పాపతోటి అంబేద్కర్, బూసి రాజలత, టీఎల్‌వీ వీరాంజనేయులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పార్టీ నేతలు బందా రవీంద్రనాథ్, గనిక జాన్సీ, ఆతుకూరి నగేష్, మాదాసు కిరణ్, రెడ్డి కోటేశ్వరరావు, ఆలా కిరణ్, బైరెడ్డి రవీంద్రారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

**పోలీసు కార్యాలయంలో...**

**నగరంపాలెం:** జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎస్పీ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరణ నిరాహార దీక్ష చేపట్టి, ప్రాణాలర్పించి అమరుడైన మహాపురుషుడు అని అన్నారు. కార్యక్రమంలో ఏఓ వరలక్ష్మీ, ఆర్ఐ.రాఘవయ్య, డీపీఓ కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాముల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఎస్పీ సుప్రజ

# 19న సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

**గుంటూరు వెస్ట్ (క్రీడలు):** శాప్ ఆధ్వర్యంలో ఈ నెల 19న తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలో సీనియర్ మహిళా కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని స్టెప్ సీఈఓ పల్లవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన జట్టు ఈ నెల 23 నుంచి 26 వరకు హర్యానాలో జరగనున్న 69వ సీనియర్ మహిళా కబడ్డీ పోటీలకు పంపిస్తామన్నారు.

**అండర్–17 బాలబాలికల చెస్ పోటీలు**

జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న ద్వారకా కృష్ణ రెయిన్ ట్రీ పార్క్‌లో అండర్–17 బాల బాలికల చెస్ పోటీలు నిర్వహిస్తామని అధ్యక్షులు సిహెచ్. రవీంద్ర రాజు గురువార ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2006 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ప్రతిభకనబరిచిన వారిని త్వరలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 79816 64035 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

# అదాలత్‌లో 42 సమస్యల పరిష్కారం

**మేడికొండూరు:** గుంటూరు–2 టౌన్ డివిజన్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో డోకిపర్రు సబ్‌స్టేషన్ ఉపకేంద్ర ఆవరణలో గురువారం విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహించారు. డివిజన్ పరిధిలోని మేడికొండూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లోని వినియోగదారులు పాల్గొని వారి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పలువురు వినియోగదారులు లిఖితపూర్వకంగా 43 అర్జీలు అందించారు. వాటిలో 42 అప్పటికప్పుడే పరిష్కరించారు. మండలంలోని శిరిపురంలో ఒక సమస్యను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ జస్టిస్ ఎన్ విక్టర్ ఇమ్మానియేలు ఆదేశించారు. అదాలత్‌లో ఎస్ఈ పి.విజయకుమార్, ఈఈ చల్లా రమేష్, ఏడీ మల్లికార్జునరావు, మేడికొండూరు ఏఈ నాగరాజు, డివిజన్‌లోని ఏడు మండలాల ఏఈలు, సాంకేతిక సభ్యులు కె.వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యులు ఎ.రామ్‌దాస్, స్వతంత్ర సభ్యులు ఎ.సునీతలు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ వినియోగదారుల అదాలత్‌లో పాల్గొన్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ జస్టిస్ విక్టర్ ఇమ్మానియేల్

# ఐదు ఆస్పత్రులకు జరిమానా

**నరసరావుపేట:** ఉచితంగా చేయాల్సిన ఆరోగ్యశ్రీ వైద్యసేవలకు పేషెంట్ల వద్ద నుంచి డబ్బులు వసూలుచేసిన ఐదు ఆసుపత్రుల యాజమాన్యాలకు జిల్లా డిసిప్లేనరీ కమిటీ జరిమానా విధించింది. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా డిసిప్లేనరీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 171 ఫిర్యాదులను కమిటీ సభ్యులు విచారించారు. అందులో 162 ఏఎస్ఎం మొబైల్ యాప్ సమస్యలు, ఐవీఆర్ఎస్ ఓట్‌బౌండ్ కాల్స్ ద్వారా నమోదైన తొమ్మిది సమస్యలను విచారణ చేసి డబ్బు వసూలు చేసిన ఐదు హాస్పిటల్స్‌కి జరిమానా విధించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా పేషెంట్లకు బిల్లులు లేకుండా నగదు రహిత వైద్యం అందించేలా ఆసుపత్రి యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా కన్వీనర్ డాక్టర్ వినీల, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి, జిల్లా ప్రభుత్వాసుపత్రుల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు, ఐ అండ్ పీఆర్ డీడీ దీప్తి పాల్గొన్నారు.



# సంకల్ప బలంతో లక్ష్యానికి చేరుకోండి

భారత్ చెస్ క్రీడాకారుడు, ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్ ఎంఆర్ లలిత్ బాబు

**పెదకాకాని:** విద్యార్థులు సరైన వయసులో లక్ష్యాన్ని ఎంచుకుని దృఢ సంకల్పంతో కష్టనష్టాలను అధిగమించి లక్ష్యం సాధించాలని భారత్ చెస్ క్రీడాకారుడు, ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్ ఎంఆర్ లలిత్ బాబు అన్నారు పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల్లో గురువారం నిర్వహించిన క్రీడా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్ లలిత్‌బాబు మాట్లాడుతూ చిన్నతనం నుంచి సమయాన్ని సరైన విధంగా సద్వినియోగం చేసుకోవడం వలన చెస్ పోటీల్లో రాణించగలిగానన్నారు. జయాపజయాలను వీడి విద్యార్థులు ధైర్యంగా ముందుకు అడుగు వేయాలన్నారు. కెరీర్ మొదట్లో విదేశీ టోర్నమెంట్లకు పాల్గొన్నందుకుగాను తనకు వీవీఐటీ కళాశాల యాజమాన్యం అండగా నిలిచిందని గుర్తు చేసుకున్నారు. తన కెరీర్ ఎదుగుదలకు తన తల్లి సహకారం ఎంతగానో తోడ్పడిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ తెలుగు వారందరూ గర్వించదగ్గ క్రీడాకారుడు, భవిష్యత్‌లో దేశానికి గొప్ప విజయాలను అందించగలరన్నారు. అనంతరం అంతర్ కళాశాలల యందు నిర్వహించిన క్రీడల్లో విజేతలకు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వీవీఐటీ కళాశాల నుంచి కాకినాడ జేఎన్‌టీయూ స్పోర్ట్స్ టోర్నమెంట్ జట్లకు ఎంపిక కాబడిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, అడ్మిన్ డీన్ డాక్టర్ ఎన్.కుమార్ స్వామి, ఫిజికల్ డైరెక్టర్‌లు డాక్టర్ ఎన్.అరుణ్ కుమార్, డాక్టర్ ఎం.గిరిధర్, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రాండ్ మాస్టర్ లలిత్‌బాబుకు జ్ఞాపికను అందజేస్తున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

# రోకలిబండతో భర్తను హతమార్చిన భార్య

- ముందు ప్రమాదం అంటూ హడావుడి!
- ఆపై తానే హత్యచేశానంటూ లొంగుబాటు
- పెనుమాకలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

**తాడేపల్లిరూరల్:** మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పెనుమాకలో భర్తను భార్య చితకబాది హత్యచేసిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చివరకు పోలీసులు అది హత్యేనని నిర్ధారించి ఆ మహిళపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సేకరించిన వివరాల ప్రకారం పెనుమాకకు చెందిన సోమవరపు యేసు (45)కు భార్య ఆనందకుమారికి 25 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరిద్దరూ కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. మద్యానికి బానిసైన యేసు మద్యం తాగి రోజూ భార్యను అనుమానిస్తూ చితకబాదుతున్నాడు. ఇదే క్రమంలో ఈ నెల 13వ తేదీన మధ్యాహ్నం 1 గంట సమయంలో తాగి వచ్చిన యేసు భార్యను తిట్టడంతో ఆమె ఇంట్లో ఉన్న రోకలి బండతో చితకబాదింది. వెంటనే ఆమె ఏమీ తెలియనట్లు తన భర్త జారిపడి దెబ్బలు తగిలాయని చెప్పడంతో భర్త బంధువులు ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు.

అప్పటికే యేసు మృతి చెందడంతో ఆసుపత్రి వారు తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. యేసు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించిన అనంతరం ఇంటి వద్ద ఘటన ఎలా జరిగిందో తెలుసుకోవడానికి వెళ్లిన పోలీసులకు భార్య ఆనందకుమారి ప్రవర్తనపై అనుమానం వచ్చింది. క్షుణ్ణంగా పరిశీలించగా గోడపై రక్తపు మరకలు కనిపించాయి. పోలీసులు ఆ దిశగా విచారణ చేపట్టగా ముందు తనకు ఏమీ తెలియదని, భర్త జారి పడ్డాడని పోలీసులకు చెప్పిందే చెప్పింది. దీంతో పోలీసులు అక్కడి తిరుగుముఖం పట్టారు. అయితే జరిగిన విషయం పోలీసులకు అర్థమైందని తెలుసుకున్న ఆనందకుమారి వీఆర్వో సహాయంతో తాడేపల్లి పోలీసులకు లొంగిపోయింది. తన భర్తను తానే రోకలిబండతో కొట్టానని పేర్కొంది. బట్టలు ఉతికిన దగ్గర సబ్బు నీళ్లపై కాలు వేసి జారిపడి తన భర్త మృతి చెందాడని చెప్పాను, కానీ నేను భర్తను హత్య చేసానని చెప్పడంతో కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు.



హత్యకు గురైన సోమవరపు యేసు

# 14 గ్రానైట్ లారీల పట్టివేత

**కారెంపూడి:** అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్న 14 లారీలను పట్టుకుని తగు చర్యల నిమిత్తం దాచేపల్లి మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు అప్పగించామని ప్రాంతీయ నిఘా, అమలు అధికారి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. కారెంపూడి సమీపంలోని శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద, కారెంపూడిలో, మా చర్ల సాగర్ రోడ్డులో బుధవారం రాత్రంతా నిఘా పెట్టి అక్రమంగా తరలిపోతున్న గ్రానైట్ లారీలను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పట్టుకున్న వాటిలో 13 లారీలలోని గ్రానైట్‌కు మైనింగ్ ట్రాన్సిట్ పాసులు లేవని, మరో లారీకి ఈ వే బిల్లు లేకుండా వెళ్తున్నాయని పేర్కొన్నారు. గ్రానైట్ లారీలు ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి కారెంపూడి మీదగా ఏవిధమైన బిల్లులు లేకుండా హైదరాబాదు, మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు అక్రమంగా తరలిపోతున్నాయని అందిన సమాచారం మేరకు నిఘా పెట్టి ఈ గ్రానైట్ లారీలను పట్టుకున్నామని పేర్కొన్నారు.